


— ఎస్. వివేకానంద

డిగ్రీ కాలేజి ఊరికి చాలా దూరంలో వుంది. స్టూడెంట్స్, స్టాఫ్ అందరూ సిటీబస్‌లోనే వెడతారు కాలేజీకి. ఒకరో, ఇద్దరో స్కూటర్ల మీద వస్తారు.

సిటీ బస్సు ఫ్రంట్ డోర్ నుంచి స్త్రీలే ఎక్కాలి. అది రూలు! కానీ, అత్యవసర పరిస్థితుల్లో మగవాళ్ళు కూడా ఎక్కుతూంటారు. స్టూడెంట్స్‌తో గొడవ దేనికి లెమ్మని డ్రైవరు, కండక్టరు కిమ్మనరు.

షుమారు యాభైమంది సుఖ ప్రయాణం చేసేటందుకు వీలుంటుందా బస్సులో. కానీ ... నూట యాభై మందిని కాలేజీ టైంలో మోసుకెడుతుంది. ఫుట్‌బోర్డు మీద తొక్కుకుంటూ నిలబడే వాళ్ళు ... చువ్వలు పట్టుకు వేలాడే వాళ్ళు ... బస్సులో ఒకరి నొకరు తోసుకుంటూ ... మధ్య మధ్య ఆడపిల్లల మీద పడుతూ ... జోకులు ... వెకిలి చేష్టలు ... అరుపులు, కేకలతో సిటీ బస్సు సందడిగా వుంటుంది.

స్టూడెంట్స్ వడవడిక గురించి క్లాస్ రూమ్‌లోనే ప్రస్తావించగల పత్తాలేని లెక్చరర్లు ... ఇక సిటీ బస్సులో వాళ్ళ ప్రవర్తనని ఏం సర్దగలరు పాపం?...

యువతతో ఢీకొనగల ధైర్యం, తెగింపు ఏ లెక్చరర్‌కీ లేదు. అందుకే బస్‌లో ఏం జరిగినా కళ్ళప్పగించి చూస్తూండిపోతారు. వీరి మంచితనాన్ని చేతగానితనంగా భావించే స్టూడెంట్సూ లేకపోలేదు.

ఎకనమిక్స్ హెడ్ పేరు బర్కిలీ! ఈయనగారి అసలు పేరేమిటో చాలామందికి తెలీదు. పాత రోజుల్లో బర్కిలీ సిగరెట్ పెట్టె మీది బొమ్మను పోలివుండే ఆకృతి ఆయనది. అందుకే ఆయనకు ఆ నిక్ నేమ్!

ఈయనగారి మీద జోక్ వేయని స్టూడెంట్ అంటూ వుండడు. ఎవరు ఎన్ని అన్నప్పటికీ పాపం నోరు మెదపడు. భూదేవిలా ఓర్పు వహిస్తూ స్పోర్టివ్‌గా తీసుకుని నవ్వి వూరుకునే స్వభావం.

ప్రయివేట్ సిటీ బస్సు కావడంతో ఎవరు, ఎక్కడ దిగాలనుకుంటే అక్కడ "హోల్డాన్ ... హోల్డాన్ ..." అంటే చాలు బస్ ఆగుతుంది.

మధ్యలో దిగేవాళ్ళు లేకపోయినా "హోల్డాన్ ... హోల్డాన్" అని కేకలు వేస్తూ డ్రైవర్ని ఏడిపిస్తూంటారు స్టూడెంట్స్.

"రైట్" — "హోల్డాన్" అనే సూచనలివ్వడం బస్ కండక్టర్ మానుకున్నాడు. విద్యార్థులతో వేగలేక ఆ డ్యూటీని వాళ్ళపరం చేసేశాడు.

బర్కిలీ మాష్టారికి స్కూటరున్నా దాన్ని వాడడు. ప్రతిరోజూ సిటీ బస్సులోనే కాలేజీ కొస్తాడు. మనిషి పిసినారి కావడంతో పెట్రోలు ఖర్చు దేనికి అనుకునే స్వభావం. 'వాడకపోతే తుప్పు పట్టిపోతుంది సార్ ... పాత ఇనుప సామాను కింద అమ్మేయాల్సి వస్తుందని' స్టూడెంట్స్ ఆటపట్టిస్తూంటారు.

బర్కిలీ మేష్టారు కాలేజీలో కల్చరల్ వింగ్‌కి వైస్-ప్రెసిడెంట్ కూడా! ఏ ఫంక్షనొచ్చినా విద్యార్థులను పోగుచేసి ఏదో ఒక సాంస్కృతిక ప్రదర్శన ఇప్పించడం ఆయన అలవాటు.

ఒకసారి అంతర్విశ్వవిద్యాలయ యూత్ ఫెస్టివల్ డ్రామా పోటీలు వాల్తేరులోని ఆంధ్రా యూనివర్సిటీలో నిర్వహింపబడ్డాయి.

పుస్తకాల షాపులన్నీ తిరిగి, పుస్తకాలన్నీ ఓపికగా వెతికి చివరికి ఓ నాటకాన్ని సెలెక్ట్ చేశాడు బర్కిలీగారు. నాటకానుభవం వున్న స్టూడెంట్స్‌ని పిల్చి మరోసారి టెస్ట్ చేసి కేరక్టర్స్ ఫిక్స్ చేయడం జరిగింది.

వాల్తేరు వెళ్ళివచ్చేటందుకు టీమ్ అంతటికీ రైల్వే కన్సెషన్ కోసం అప్లై చేసి తెప్పించాడు బర్కిలీగారు.

ఆర్టిస్టులు, ఆర్కెస్ట్రా అంతా కల్పి పదిహేనుమంది. వీరందరికీ మేనేజరు, డైరెక్టరు బర్కిలీ!

ఓ శుభ ముహూర్తాన అంతా రైలెక్కారు.

కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన క్షణం నుంచి జోకులు, నవ్వులు ... మధ్యమధ్య వాయిద్య సంగీతం ... పాటలు ... ఒకటే సందడి.

తోటి ప్రయాణీకులు కూడా వీరి గోల చూచి విసుక్కోకుండా నవ్వుల్లో పాలు పంచుకోసాగేరు.

ఆకతాయి కుర్రాళ్ళు ... రైల్లో అడుక్కుతినే ... అమ్ముకునే వారిలాగ అరుపులు! పెద్ద పెట్టున నవ్వులు.

రైలు సామర్లకోట చేరుకోగానే ఓ స్టూడెంట్ సిగరెట్ పేకెట్ కొందామని ప్లాట్‌ఫారం మీదికి దిగేడు. వాడెంతకీ తిరిగి రాలేదు.

రైలు కూత పెట్టి బయల్దేరింది మెల్లగా.

వెళ్ళినవాడు తిరిగి రానందుకు మిగతా స్టూడెంట్సందరిలోనూ కలవరం బయల్దేరింది.

వాడిని మధ్యలో వదిలేస్తే ఎలా? నాటకం ఏమౌతుంది? — తర్వాత ట్రయిన్లో వాల్తేరుచేరుకోవడానికి వాడి వద్ద డబ్బుందో, లేదో?

ఇంతలో బర్కిలీ మాష్టారు "హోల్డాన్ ... హోల్డాన్ ..." అంటూ తన సహజ ధోరణిలో కేకలు పెట్టసాగేరు.

మిగతా స్టూడెంట్సంతాఏకమై ఆయనతో శృతికలిపేరు.

ఎంతకీ ట్రయిన్ ఆగదు!

"అయ్యో ఇది రైలు బండి! సిటీ బస్సు కాదు హోల్డాన్ అని అరిస్తే ఆగడానికి. చైన్ లాగండి. ఊ! త్వరగా ..." అంటూ తోటి ప్రయాణీకుడెవరో సలహా ఇచ్చాడు.

అందరికీ మతిపోయినట్టయింది.

సమయస్ఫూర్తి కోల్పోయి ప్రవర్తించినందుకు అంతా సిగ్గుతో తల వంచుకున్నారు.

చైన్ లాగగానే రైలు ఆగింది!